నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 16 నవంబర్ 2024 HYDERABAD




## కార్తిక పౌర్ణమి

శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయంలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.



## సర్వేపై నమ్మకం లేదు

ఆటో యూనియన్ నేతల ఆందోళన

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే భద్రతపై నమ్మకం లేదని ఆటో యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేకు సంబంధించిన ఫారాలు మేడ్చల్ పట్టణ సమీపంలోని రేకులబావి నుంచి భారత్ ప్రెటోల్ బంక్ వరకు పడి ఉన్న ఘటనపై శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై సర్వే ఫారాలను చూసి తాము సేకరించామని చూపించారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించాలని డిమాండ్ చేశారు. - మేడ్చల్



కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లోని సాయిబాబా ఆలయంలో లక్ష దీపాలను వెలిగిస్తున్న భక్తులు

# సర్వే ఫారాలు.. రోడ్డు పాలు

- సమగ్ర కుటుంబ సర్వేపై నమ్మకం కోల్పోతున్న ప్రజలు
- సర్వేపై అభద్రత భావం
- రోడ్డుపై పడిన సర్వే ఫారాలపై విచారణ ప్రారంభించిన అధికారులు

మేడ్చల్, నవంబర్15 (నమస్తే తెలంగాణ): సమగ్ర కుటుంబ సర్వేపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. సర్వే దేశానికే దిక్సూచి, సామాజిక న్యాయం అంటూ ఆర్భాటంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన సర్వే ఫారాలు రోడ్డుపై కనిపించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా.. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి దాటిన తర్వాత మేడ్చల్-నిజామాబాద్ వెళ్లే దారిలో రేకుల బావి చౌరస్తా నుంచి భారత్ పెట్రోల్‌బంక్ వరకు 44 జాతీయ రహదారి పొడువునా గురువారం సాయంత్రం సర్వే ఫారాలు రోడ్డుపై కనిపించాయి. దీంతో సర్వేపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. ఇప్పటికే సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లకు తమ కుటుంబ వివరాలు అందించకుండా ప్రజలు తిప్పి పంపిన ఘటనలు నగరంలో అనేకం జరిగాయి. అయితే పూరించని సర్వే ఫారాలను ఎక్కడికి తీసుకెళ్తుండగా రోడ్డుపై పడిపోయి ఉంటాయని అధికారులు ఇప్పటికే విచారణ ప్రారంభించారు. సర్వే ఫారాలు రోడ్డుపై పడిన తీరును చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్ద పడుతున్నదని ప్రజలు వాపోతున్నారు. సర్వేలో తమ కుటుంబ వివరాలు ఇవ్వాలా వద్ద అన్న ఆలోచనలో ప్రజలు ఉన్నారు.

### సర్వేపై ప్రజల్లో అభద్రత భావం..

సమగ్ర కుటుంబ సర్వేనా లేక ఫేక్ సర్వేనా అంటూ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సర్వేలో తమ ఆస్తులు, విలువైన తమ కుటుంబ సభ్యుల వివరాలు ఎందుకని ఎన్యూమరేటర్లను ప్రశ్నిస్తునారు. తమ వ్యక్తిగత ఆస్తుల వివరాలు బహిర్గమైతే మా పరిస్థితి ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిన విషయం తెలిసిందే. అదే తీరును ఈ సర్వేలో కనబరుస్తుంటే అభద్రతా భావం ఏర్పడుతుందని ప్రజలు పేర్కొనడం గమనార్హం.

### విచారణ చేస్తున్న అధికారులు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ రహదారిపై పడి ఉన్న సమగ్ర కుటుంబ సర్వే ఫారాలపై అధికారులు విచారణ చేస్తున్నారు. సర్వే ఫారాలు రోడ్డుపై పడి ఉన్నట్లు జిల్లా కలెక్టరేట్ నుంచి మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి కిలో మీటర్ వరకు పడి ఉన్న వేలాది సంఖ్యలో సర్వే ఫారాలను సేకరించిన విషయం తెలిసిందే. అయితే రోడ్డుపై పడి ఉన్న సర్వే ఫారాలు జిల్లాకు చెందినవా? లేక ఇతర జిల్లాలకు తీసుకెళ్తుంటే... రోడ్డుపై పడిపోయాయా ? అన్న కోణంలో విచారణ చేస్తున్నారు. సర్వేపై ప్రజలకు ఉన్న అనుమానాలు ఈ ఘటనతో మరింత బలపడ్డటైంది. సర్వే ఫారాలు రోడ్డుపై పడిపోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై మేడ్చల్ జిల్లాలో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు.





మేడ్చల్ రహదారిలో పడి ఉన్న సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు.. సర్వే ఫారాలను సేకరిస్తున్న మేడ్చల్ మున్సిపల్ సిబ్బంది

# ఆస్తిపన్ను సబ్సిడీ.. ఇక లేదు

## కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రాయితీకి నీళ్లొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బల్దియాలో అప్రకటితంగా ఆస్తిపన్ను పెంపు..!!
- పన్ను రూ.1200లోపు ఉన్నవారికి రూ.101 చెల్లిస్తే చాలని గత ప్రభుత్వం రాయితీ
- పన్ను సవరణ పేరుతో లబ్ధిదారుల మెడపై కత్తి
- స్టాండింగ్ కమిటీ తీర్మానం, ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్రజలపై భారం
- ఆదాయం పెంచుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్న అధికారులు
- సబ్ రిజిస్ట్రార్, విద్యుత్‌శాఖలను పావుగా వాడుకుంటున్న అధికారులు

సిటీబ్యూరో, నవంబర్15 (నమస్తే తెలంగాణ) : పేద, మధ్య తరగతి ప్రజలకు కల్పించిన ఆస్తి పన్ను రాయితీ పథకానికి కాంగ్రెస్ సర్కారు నీళ్లొదిలింది. ఆస్తిపన్ను రూ.1200లోపు ఉన్న నిర్మాణాలకు 2017 సంవత్సరంలో కేసీఆర్ ప్రభుత్వం పన్ను రాయితీ ఇచ్చింది. ఆ పరిధిలోని యాజమానులంతా ఏడాదికి రూ. 101 పన్ను చెల్లిస్తే సరిపోతుందని కేసీఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేశారు. ఈ మేరకు రూ.100కోట్ల మేర చెల్లింపుదారులకు లబ్ధి జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అనధికారికంగా రద్దు చేసింది. పన్ను సవరణ పేరుతో లబ్ధిదారుల మెడపై కత్తి పెట్టి.. మీకు రూ.101 ఆస్తిపన్ను పథకం వర్తించదని, ఇకపై పూర్తి స్థాయిలో పన్ను చెల్లించాలంటూ ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నది. దీనిపై కార్పొరేటర్లు, ప్రజలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్షన్ 220 ప్రకారం ట్యాక్స్ సవరణపై ప్రత్యేకంగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం రూ.101లు చెల్లించే పన్ను చెల్లింపుదారులకు పన్ను రాయితీ లేదంటూ ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నారు. ఇదే సమయంలో వాణిజ్య కేటగిరిలో విద్యుత్ కనెక్షన్లు ఉన్న నిర్మాణాలు, సున్నా విస్తీర్ణం కింద పన్ను చెల్లించిన భవనాలు, ఆస్తిపన్ను సున్నా రూపాయలుగా ఉండే నిర్మాణాలకు నోటీసులు ఇస్తున్నారు. పెరిగిన పన్ను విలువతో డిమాండ్ నోటీసులు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ రెవెన్యూ విభాగం అధికారుల తీరును రాబోయే జనరల్ బాడి సమావేశంలో ఎండగడతామని కార్పొరేటర్లు హెచ్చరిస్తున్నారు.




జీహెచ్‌ఎంసీ ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో అధికార యంత్రాంగం అడ్డదారులు తొక్కుతున్నది. నిబంధనలకు నీళ్లొదిలి ప్రజలపై పన్నుల భారం మోపుతోంది. బల్దియాకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నును ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండానే సవరణలు చేస్తోంది. ఇందుకు విద్యుత్‌శాఖ బిల్లులు, సబ్ రిజిస్ట్రార్లను పావుగా వాడుకుంటున్నది. నూతనంగా కొనుగోలు చేస్తున్న ఖాళీ స్థలం నుంచి ఇండ్లు, అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ వరకు రిజిస్ట్రేషన్ చేస్తూనే ఆస్తిపన్ను సైతం అసెస్‌మెంట్ చేస్తున్నారు. రిజిస్ట్రార్ అంతేకాదు స్టాండింగ్ కమిటీ నుంచి ఎటువంటి తీర్మానం, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే ఆస్తిపన్నును పెంచేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే బల్దియా అప్రకటిత ఆస్తిపెంపు నిర్ణయాన్ని అమలు చేస్తోందని ప్రజలు మండి పడుతున్నారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న జీహెచ్‌ఎంసీ బయటపడటానికి ఇదెక్కడి భారమంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో 19.49లక్షల ప్రాపర్టీలు ఉన్నాయి. వీటిలో రెసిడెన్షియల్ 16.35లక్షలు, నాన్ రెసిడెన్షియల్ 2.80 లక్షలు, మిక్స్‌డ్ 34వేల వరకు ఉన్నాయి. వీటిని ఈ ఆర్థిక సంవత్సరం నాటికి రూ.2100కోట్ల లక్ష్యంతో ఇప్పటి వరకు రూ. 1300 కోట్ల వరకు రాబట్టారు. టార్గెట్ చేరుకోవడానికి ప్రస్తుతం రూ.101 ఆస్తిపన్ను చెల్లిస్తున్న భవనాలకు రేట్లను సవరించి పెంచాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించి, పెంచిన పన్నునే వసూలు చేస్తున్నారు. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేసి..మొత్తంగా రూ.50కోట్ల మేర ఆదాయం పెంచుకునేలా కసరత్తు చేస్తున్నారు. కాగా ఒక వేళ ఆస్తిపన్ను పెంచాలంటే జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీలో తీర్మానం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ఉత్తర్వులు ఇవ్వాల్సిందేనని ఓ అధికారి తెలిపారు. కానీ ఈ రెండు కార్యక్రమాలు చేయకుండానే ఆస్తిపన్ను ఎలా పెంచుతారని పలువురు కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ అప్రకటిత ఆస్తిపన్ను నిర్ణయాన్ని.. వచ్చే కౌన్సిల్‌లో నిలదీస్తామని కార్పొరేటర్లు హెచ్చరిస్తున్నారు.

# రూ.300 కోట్లు వసూలు.. 3600 మందికి కుచ్చుటోపి

- ఆపై బోర్డు తిప్పేసిన 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్
- రంగంలోకి దిగిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు
- 8మంది ఘరానా మోసగాళ్లు అరెస్ట్

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): తమ కంపెనీలో పెట్టుబడులు పెట్టి ప్లాట్లు కొనుగోలు చేస్తే ప్రతి నెలా 4శాతం లాభాలు చెల్లిస్తామంటూ కొందరిని, డబుల్ గోల్డ్ స్కీమ్ కింద పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలోనే పెట్టుబడికి రెట్టింపు చెల్లిస్తామంటూ 3600మంది నుంచి సుమారు రూ.300 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన 8మంది ఘరానా మోసగాళ్లను సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం...కలిదిండి పవన్‌కుమార్ 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడికి రావుల సత్యనారాయణ, హరికృష్ణ, వల్లూరు భాస్కర్‌రెడ్డి, పగడాల రవికుమార్‌రెడ్డి, కొల్లటి జ్యోతి, కురల్ల మౌనిక, కుర్కుల లావణ్య అనుచరులుగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా తమ కంపెనీలో కనీసం రెండు గుంటల స్థలాన్ని రూ.8.08లక్షల పెట్టుబడిగా పెట్టి కొనుగోలు చేస్తే వారికి 25 నెలల పాటు ప్రతి నెలా 4శాతం చొప్పున రూ.32వేలు చెల్లిస్తామని జోరుగా ప్రచారం చేశారు. అంతే కాకుండా ఈ స్కీమ్‌లో చేర్పించిన వారికి 1శాతం చొప్పున 25నెలల పాటు ప్రతి నెలా రూ.7200 చొప్పున చెల్లిస్తామని నమ్మించారు. అదే విధంగా డబుల్ గోల్డ్ స్కీమ్‌లో కనీసం రూ.4లక్షలు పెట్టుబడి పెడితే వారికి బాండ్ ఇవ్వడంతో పాటు 12నెలల తరువాత పెట్టిన పెట్టుబడికి రెట్టింపు అంటే రూ.8లక్షల విలువ చేసే స్విట్జర్లాండ్ గోల్డ్ బిస్కెట్స్‌ను అందజేస్తామని నమ్మించారు. గోల్డ్ చిట్ స్కీమ్ పేరుతో మరో వల వేసి రూ.5లక్షలను 20నెలల పాటు పెట్టుబడిగా పెడితే పెట్టిన పెట్టుబడిపై 19నెలల పాటు 3శాతం అంటే రూ.15వేల చొప్పున ప్రతి నెలా చెల్లిస్తామని, 20వ నెల మరో రూ.15వేలు అదనంగా చెల్లిస్తామని ఈ క్రమంలో మొత్తం రూ.8లక్షలు చెల్లిస్తామని నమ్మించారు. ఈ విధంగా మొత్తం 3600 మంది నుంచి సుమారు రూ.300 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన నాయని హరికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఈఓడబ్ల్యూ పోలీసులు దర్యాప్తు జరిపి 12వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై.లి.ఎండీ కలిదిండి పవన్‌కుమార్ సహా మొత్తం 8మంది నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.



# నేడు బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు

- రాజేంద్రనగర్ నుంచి చేరికలు
- నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి నేతృత్వంలో బీఆర్‌ఎస్ భవన్‌లో...

మణికొండ, నవంబర్ 15: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు నాయకులు, యువత సిద్ధమవుతున్నారు. ఇటీవల నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఆయనతో పాటు కొంత మంది నాయకులు నామినేటెడ్ పదవులు ఆశించి కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు వినికిడి. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల సమాయత్వం అవుతున్న సందర్భంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి నేతృత్వంలో పార్టీలో చేరేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సైతం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. మణికొండ మున్సిపాలిటీ నుంచి 150 మంది నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల నుంచి వివిధ పార్టీలకు చెందిన మరో 100 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు నేడు రంగం సిద్ధం చేశారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం 11 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు సమక్షంలో తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు మణికొండ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ తెలిపారు. మణికొండ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల్లోనూ పార్టీ క్యాడర్ ఎక్కడ పార్టీ మారలేదని నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని పటిష్ట పరిచేందుకు యువ నేత కార్తీక్‌రెడ్డి నేతృత్వంలో ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలో కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా సీతారాం పేర్కొన్నారు.




# ఉపాధిని దెబ్బ తీసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### మూడో రోజు భిక్షాటనలో ఆటో డ్రైవర్లు

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : నగరంలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మూడో రోజు ఆటో డ్రైవర్లు భిక్షాటన చేపట్టారు. తమకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, తమ ఉపాధిని దెబ్బతీసి.. తమ బతుకులు రోడ్డు కీడ్చిందంటూ ప్రజల వద్ద భిక్షమెత్తుకున్నారు. ఆట, పాటలు, దరువు వేస్తూ కాంగ్రెస్ సర్కార్ మోసపూరిత హామీలను ఎండగట్టారు. గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను లూటీ చేస్తున్నారని జేఏసీ ప్రతినిధులు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ పాలనలో ఆటో డ్రైవర్లు భిక్షమెత్తుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 21న నిర్వహించే మహాధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లందరూ తరలి వచ్చి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ఆటో యూనియన్ గ్రేటర్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి యన్.కిషన్, టీఆర్ఏకేటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పల్లర్ల రవి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, బీపీటీఎంఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య యాదవ్, టీఏడీయూ అధ్యక్షుడు కొమరయ్య పాల్గొన్నారు.

# ఆపరేషన్ రోప్‌కు సహకరించండి

- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారితోనే ఆక్రమణలు
- నగర సీపీ సీవీ ఆనంద్ ట్వీట్

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆపరేషన్ రోప్‌ను పక్కాగా నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ట్రాఫిక్ పోలీసులకు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు వివిధ వస్తువులను అమ్ముకొని జీవించేందుకు సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుంటున్నారని, ఇలాంటి సందర్భాల్లో పేదరికం, జీవనోపాధి తదితర అంశాలను తీసుకురావొద్దని సీపీ సూచించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వంటివి ఒక మాఫియా లాంటి చర్య అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే ట్రాఫిక్‌కు మరింత ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రతిరోజు క్రేన్ల సాయంతో ట్రాఫిక్ క్లియరెన్స్ చేయాల్సిన అవసరముందన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఈ పని చేస్తున్నప్పుడు అధికారులు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటారని సీపీ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపు, రోప్ అమలులో ట్రాఫిక్ సిబ్బందికి ప్రతిఒక్కరూ సహకరించాలని సీపీ కోరారు.



### ఆపరేషన్ రోప్..

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు చేపట్టిన ఆపరేషన్ రోప్(రిమూవబుల్ అబ్‌స్ట్రాక్టివ్ పార్కింగ్ ఎన్‌క్రోచ్‌మెంట్స్)ను పటిష్టంగా అమలు చేస్తే రోడ్లపై వాహనాలు సాఫీగా వెళ్లే అవకాశముంటుంది. పోలీస్‌స్టేషన్ల వారీగా రోప్ అమలు చేసేందుకు ఎస్‌హెచ్‌ఓల యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుంటున్నారు. ఇంకా యాక్షన్ ప్లాన్ చేసుకోని వారు ఉంటే వెంటనే తయారు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ఆయా ఠాణాల పరిధిలో ఎక్కడ ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది? ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆయా ట్రాఫిక్ ఠాణాల పరిధిలో ఉన్న సమస్యలను జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ తదితర విభాగాల అధికారులతోనూ సమన్వయం చేసుకోవాల్సిన అవసరముంటుంది. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ రోజురోజుకు గాడి తప్పుతుంది. ఆపరేషన్ రోప్‌తో సాఫీగా ట్రాఫిక్ సాగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నగరవాసులు కోరుతున్నారు.

# మహిళను బెదిరించి.. 38 వేలు కాజేసి

బంజారాహిల్స్, నవంబర్ 15: 'మీ నాన్నకు నేను డబ్బులు ఇవ్వాల్సి ఉందంటూ..' మహిళకు ఫోన్ చేసి ఆమె అకౌంట్‌లోనుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.1లో నివాసం ఉంటున్న స్వాగత్ రాయ్ అనే గృహిణికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ తండ్రికి నేను చాలా కాలంగా రూ.22వేలు ఇవ్వాల్సి ఉందని, మీ నంబర్‌కు గూగుల్ పే ద్వారా డబ్బులు పంపిస్తున్నానని చెప్పాడు. క్షణాల్లోనే ఆమె ఫోన్‌కు రూ.10వేలు, రూ.20వేలు వచ్చినట్లు మెసేజ్‌లు వచ్చాయి. మెసేజ్‌లు వచ్చిన వెంటనే స్వాగత్ రాయ్‌కు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి తాను పంపిన డబ్బులు వచ్చాయా అని అడిగాడు. ఫోన్‌లో మెసేజ్‌లు వచ్చిన విషయాన్ని గురించి ఆమె చెప్పింది. వెంటనే మరో రూ.12వేలు, రూ.20వేలు వచ్చినట్లు మెసేజ్‌లు వచ్చాయి. మరోసారి కాల్ చేసిన అగంతకుడు తాను ఇవ్వాల్సిన డబ్బులకన్నా ఎక్కువ ఇచ్చానని, వాటిని వెనక్కి పంపాలని కోరాడు. తన బ్యాంక్ అకౌంట్‌లోకి డబ్బులు రాలేదని, కేవలం మెసేజ్‌లు మాత్రమే వచ్చాయని స్వాగత్‌రాయ్ చెబుతున్నా వినిపించుకోకపోగా.. తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేయడం ప్రారంభించాడు. మర్యాదగా తాను పంపిన డబ్బులు వెనక్కి పంపించకపోతే కేసు పెడతానంటూ దబాయించడంతో ఆందోళనకు గురైన బాధితురాలు అతడికి రూ.38వేలు పంపించింది. డబ్బులు పంపిన తర్వాత భర్తకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పగా సైబర్ నేరస్తులు కావచ్చుని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించాడు. దీంతో అరగంట వ్యవధిలోనే బంజారాహిల్స్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా.. సైబర్ సెల్ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయించి డబ్బులను హోల్డ్ చేయించారు. ఈ మేరకు పోలీసులు సైబర్ నేరగాళ్లపై బీఎన్ఎస్ 318(2), 318(4), 66సీ, 66డీ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.